www.kalamdaily.com

Follow on:
Kalamtelugu

# కలం
ప్రజల గళం...

26-02-2026, గురువారం    పేజీలు: 2

360°
SINGLE TOPIC

# పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్



స్కూల్ సిలబస్‌ను మనం ఎంత జాగ్రత్తగా రూపొందిస్తామో.. అలాగే ఏఐ, సోషల్ మీడియా సంస్థలు కూడా పిల్లలకు అంతే సేఫ్ కంటెంట్‌ను ఇవ్వాలి. పిల్లల భద్రత విషయంలో మనం మరింత అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను రక్షించడం అనేది కేవలం చట్టాలు లేదా నిబంధనల విషయం కాదు. ఇది మన నాగరికతకు సంబంధించిన అంశం. నిజ జీవితంలో పిల్లలకు ఏది నిషేధమో.. డిజిటల్ లోకంలో కూడా అది నిషేధమే కావాలి. డీప్ ఫేక్స్, తప్పుడు సమాచారం కేవలం వ్యక్తులనే కాదు, మొత్తం సమాజాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను అస్థిరపరుస్తాయి.
- నరేంద్ర మోదీ,
ప్రధానమంత్రి

**సేఫ్ కంటెంట్ ఇవ్వాలి**

## త్వరలో ఇండియాలో?

ఆస్ట్రేలియా తరహాలో 16 ఏండ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ విధించాలని ఇండియాలోనూ డిమాండ్లు వస్తున్నాయి. కేంద్రం కూడా దీనిపై ఫోకస్ పెట్టింది. “16 ఏండ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా యాక్సెస్‌ను పరిమితం చేసేలా ఐటీ రూల్స్ 2021కి సవరణలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది” అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజాగా ప్రకటించారు.

### డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్-2025 ఏంటి?

18 ఏళ్లలోపు ఎవరైనా సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే, వారి తల్లిదండ్రుల నుంచి డిజిటల్ పద్ధతిలో (ఓటీపీ లేదా ఐడీ వెరిఫికేషన్ ద్వారా) అనుమతి తీసుకోవడం తప్పనిసరి.

పిల్లల ఆన్‌లైన్ ప్రవర్తనను ట్రాక్ చేయడం, వారి ఇష్టాయిష్టాలను బట్టి యాడ్స్ చూపించడం పూర్తిగా నిషేధం.

పిల్లల మానసిక స్థితిని దెబ్బతీసే అల్గారిథమ్‌ను వాడకూడదు.

కేవలం ‘టిక్ మార్క్’ సరిపోదు. డీజీ లాకర్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు వ్యవస్థలతో లింక్ చేసిన వయస్సు నిర్ధారణ పద్ధతులను వాడాలి.

### ఉల్లంఘిస్తే జరిమానాలు

పిల్లలకు సంబంధించిన నిబంధనలను పాటించడంలో విఫలమైతే (సెక్షన్ 9 ఉల్లంఘన), సోషల్ మీడియా సంస్థలకు గరిష్టంగా రూ.200 కోట్ల వరకు జరిమానా విధించవచ్చు.

డేటా లీక్ అయితే రూ.250 కోట్ల వరకు జరిమానా పడే అవకాశం ఉంది. తప్పు సరిదిద్దుకోకపోతే రోజువారీ జరిమానాలు కూడా విధిస్తారు.

ముందట ఫోన్‌లో బొమ్మలు పెడ్తే కానీ నోట్లో ముద్ద పెట్టుకోని పసి బాల్యం!

పొద్దున లేచింది మొదలు స్కూల్‌కు వెళ్లేదాకా.. తిరిగి స్కూల్ నుంచి వచ్చి బెడ్ ఎక్కేదాకా రీల్స్, షార్ట్స్ చూడనిదే.. వాటిలో పోస్టులు పెట్టనిదే గడవని టీనేజ్!

ఫలితంగా సహజ ఆటలకు పిల్లలు దూరమవుతున్నారు. తోటివారితో స్నేహాలూ లేవు. అమ్మానాన్నతో, నాన్నమ్మ తాతయ్యతో ముద్దు.. ముచ్చట్లూ ఉండటం లేదు.

పైగా.. పొద్దస్తమానం సోషల్ మీడియాలో చిన్నారులు మునిగితేలడంతో వారి మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నది. భవిష్యత్తు మసకబారిపోతున్నది.

*సోషల్ మీడియా ఉచ్చు నుంచి బాల్యానికి రెక్కలు తొడిగేందుకు చాలా దేశాలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కఠిన నిబంధనలు తెస్తున్నాయి. 16 ఏండ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేస్తున్నాయి. ఆ దిశగా మొదటి అడుగు ఆస్ట్రేలియాలో పడింది. తర్వాత ఫ్రాన్స్, నార్వే, బ్రిటన్, స్పెయిన్.. ఇలా వరుస బెట్టి దేశాలు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సోషల్ మీడియాను కట్టడి చేస్తున్నాయి. ఇండియాలో కూడా ఇదే వాదన వినిపిస్తున్నది. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని వేసింది. కర్నాటక సర్కార్ ప్రజాభిప్రాయ సేకరణ చేపడ్తున్నది. ఈ అంశంపై*
*కలం 360 డిగ్రీస్ స్పెషల్ స్టోరీ...*

తెలంగాణ బ్యూరో, కలం

# బాల్యానికి స్క్రీన్ బ్యాన్!



## సోషల్ మీడియా ఉచ్చు నుంచి క్రమంగా విముక్తి

16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియాను బ్యాన్ చేసిన ఆస్ట్రేలియా

అదే బాటలో పలు దేశాలు.. ఇండియాలో కూడా పెరుగుతున్న డిమాండ్

**మొబైల్‌కు దూరంగా ఉంటే..!!**

- నిరంతరం స్క్రీన్ చూడటంతో చూపు మందగిస్తుంది.
- మొబైల్ నుంచి వచ్చే ‘బ్లూ లైట్’ మెదడులో నిద్రకు కారణమయ్యే మెలటోనిన్ ఉత్పత్తి తగ్గి ఏకాగ్రత లోపిస్తుంది.
- గంటల తరబడి కూర్చుని ఉండటంతో ఊబకాయం, వెన్నెముక సమస్యలు, జీవక్రియ మందగిస్తుంది.
- ఫోన్‌ను దూరం పెట్టి ఔట్, ఇండోర్ ఆటలకు ప్రాధాన్యత ఇస్తే ఇలాంటి ఆరోగ్య సమస్యలేవి దరిచేరవు.

### ఏపీలో మంత్రివర్గ ఉప సంఘం



16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయడంపై సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఆంధ్రప్రదేశ్ సర్కార్ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. “ఏపీలో కూడా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నియంత్రించే లేదా నిషేధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది”అని జనవరి, 2026లో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు, అమరావతిలో జరిగిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రి లోకేష్ ప్రస్తావించారు.

### కర్నాటకలో అభిప్రాయసేకరణ



కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఇటీవల స్టేట్ యూనివర్సిటీ వీసీలతో సమావేశమై, 16 ఏళ్లలోపు వాళ్లు ఫోన్ల వాడకంపై నిషేధం విధించడంపై అభిప్రాయాలను కోరారు. “సోషల్ మీడియా, గేమింగ్ వ్యసనం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇది వారి భవిష్యత్తును దెబ్బతీస్తున్నది. చిన్న వయసులోనే అశ్లీల కంటెంట్, సోషల్ మీడియా ఒత్తిళ్లకు లోనవుతున్నారు. కేవలం చదువే కాకుండా, పిల్లలు సమాజంతో సంబంధాలు తెంచుకుని ఫోన్లలోనే గడుపుతున్నారు”అని సిద్ధరామయ్య అన్నారు.

### మైనర్ యూజర్లు 120 కోట్లు

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 120 కోట్లకు పైగా 18 ఏళ్లలోపు వారు ఏదో ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో యాక్టివ్‌గా ఉన్నారని అంచనా. 13 ఏండ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో దాదాపు 40% మంది.. నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియా అకౌంట్లను కలిగి ఉన్నట్లు ఆఫ్‌కామ్, ఇతర సంస్థల నివేదికలు చెప్తున్నాయి. ఇండియాలో దాదాపు 30% సోషల్ మీడియా యూజర్లు 18 ఏళ్లలోపు వారేనని అంచనా. ఒకప్పుడు నంబర్ 1గా ఉన్న ఫేస్‌బుక్ ఇప్పుడు పిల్లల్లో బాగా వెనుకబడింది. కేవలం 30% లోపు టీనేజర్లు మాత్రమే ఫేస్‌బుక్ వాడుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి. 16 ఏళ్లలోపు పిల్లలు సగటున రోజుకు 4 నుంచి 5 గంటల సమయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో గడుపుతున్నట్లు గుర్తించారు. 10% నుంచి 15% మంది పిల్లలు ప్రాబ్లమాటిక్ సోషల్ మీడియా యూజ్ (అడిక్షన్)తో ఇబ్బంది పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.



### ప్రమాదకరమైన ‘ఎస్ఎం ఛాలెంజెస్’

అనేక ప్లాట్‌ఫామ్‌లో వైరల్ అయ్యే కొన్ని ఛాలెంజ్‌లు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఊపిరి బిగబట్టి ఉండాలనే బ్లాక్ ఔట్ ఛాలెంజ్‌తో అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో 2022-2024 మధ్య కనీసం 15-20 మంది పిల్లలు మరణించినట్లు నివేదికలు ఉన్నాయి.

ఇటీవల మెక్సికోలో స్టూడెంట్లు నిద్ర మాత్రలు మింగి ఎవరు ఎక్కువ సేపు నిద్రపోకుండా ఉంటారో ట్రాంక్విలైజర్ ఛాలెంజ్ పెట్టుకుని ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు.

ఇండియాలో పట్టాల పక్కన రీల్స్ చేస్తూ రైలు ఢీకొని చనిపోయిన ఘటనలు దాదాపు ప్రతి వారం ఎక్కడో ఒకచోట నమోదవుతూనే ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా సెల్ఫీల వల్ల జరుగుతున్న మరణాల్లో ఇండియా (50శాతం) అగ్రస్థానంలో ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. సెల్ఫీ మరణాల్లో దాదాపు 50% నుంచి 60% వరకు మరణాలు 20 ఏళ్లలోపు వారే ఉంటున్నారు.



చైనాలో ‘మైనర్ మోడ్’
(2వ పేజీలో)

కలం ప్రజల గళం...
360° SINGLE TOPIC
2
26-02-2026,
గురువారం

# పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్



## ప్రపంచానికి మార్గదర్శిగా ఆస్ట్రేలియా

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధాన్ని చట్టబద్ధం చేసింది. 2025, డిసెంబర్ 10 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో 16 ఏండ్లలోపు వారు ఖాతాలు తెరవడంపై నిషేధం విధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే.. సదరు సోషల్ మీడియా సంస్థలపై రూ.318 కోట్ల భారీ జరిమానా తప్పదు. అయితే..
పిల్లలకు, తల్లిదండ్రులకు మాత్రం ఎలాంటి శిక్షా ఉండదు.

మెసేజింగ్ యాప్స్ (వాట్సాప్), ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, విద్యా సంబంధిత యాప్‌లకు ప్రస్తుతానికి మినహాయింపు.

యూజర్ ముఖాన్ని స్కాన్ చేసి వారి వయస్సును అంచనా వేసే సాంకేతికతను కంపెనీలు ఉపయోగిస్తున్నాయి.

బ్యాంకులు, టెలికాం సంస్థల సర్వీసుల ద్వారా వయస్సును నిర్ధారించుకుంటున్నాయి.

ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులను అడుగుతాయి.

చట్టం అమల్లోకి వచ్చిన మొదటి నెలలోనే దాదాపు 50 లక్షల మైనర్ల ఖాతాలు వివిధ ప్లాట్‌ఫామ్స్ తొలగించాయి.

'మేము ప్రయత్నించాం.. కానీ పిల్లలు దొంగచాటుగా వచ్చారు''అని కంపెనీలు తప్పించుకోకుండా, వారు తీసుకున్న చర్యలు ఎంత పటిష్టంగా ఉన్నాయో నిరూపించుకోవాలి.

మెజారిటీ తల్లిదండ్రులు దీనిని స్వాగతిస్తున్నారు.

## గల్ఫ్ దేశాల్లో నిబంధనలు కఠినం

గల్ఫ్ దేశాల్లో సోషల్ మీడియా వినియోగం ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటుంది. అందుకే, అక్కడి ప్రభుత్వాలు చిన్నారుల డిజిటల్ భద్రత కోసం ఆధునికమైన, కఠిన చట్టాలను అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా యూఏఈ, సౌదీ అరేబియా తీసుకుంటున్న చర్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.

యూఏఈ ప్రభుత్వం జనవరి 1, 2026 నుంచి చైల్డ్ డిజిటల్ సేఫ్టీ లాను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం టెక్‌కంపెనీతో పాటు పేరెంట్స్ కూడా బాధ్యులే. తమ వయస్సుకు మించి యాప్స్ వాడుతుంటే.. పేరెంట్స్‌పై రూ.2.2 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. 13 ఏండ్లలోపు పిల్లల డేటాను సేకరించడంపై పూర్తి నిషేధం. ఒక వేళ సేకరించాల్సి ఉంటే పేరెంట్స్ నుంచి డాక్యుమెంటెడ్ కన్సెంట్ తీసుకోవాలి.

సౌదీ అరేబియాలో సెప్టెంబర్, 2025 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం.. సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు తమ వీడియోల్లో లేదా ప్రమోషన్లలో చిన్న పిల్లలను చూపించడం నేరం. రూల్స్ ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు సోషల్ మీడియా అకౌంట్లు, లైసెన్సులు రద్దు చేస్తారు.

ఖతార్ ప్రభుత్వం నిషేధం కంటే అవేర్‌నెస్ మీద ఎక్కువ దృష్టిపెడ్తున్నది. పిల్లలకు స్కూల్ స్థాయి నుంచే సైబర్ రిస్క్‌ల గురించి అవగాహన కల్పిస్తున్నది. సోషల్ మీడియా వయో పరిమితిని 13 ఏండ్ల నుంచి 16 ఏండ్లకు పెంచే అంశంపై చర్చలు జరుపుతున్నది.

## మలేషియాలో రూల్స్ ఉల్లంఘిస్తే భారీ ఫైన్

16 ఏండ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకంపై మలేషియా సర్కార్ నిషేధం విధించింది. గతంలో ఉన్న 13 ఏండ్ల బ్యాన్‌ను తాజాగా 16 ఎండ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిబంధన జులై 2026 నాటికి పూర్తి స్థాయిలో పటిష్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. వయస్సు గుర్తింపు కోసం ఈకేవైసీ విధానాన్ని యూజ్ చేస్తున్నారు. మలేషియాలో 80 లక్షల కంటే ఎక్కువ మంది యూజర్లు ఉన్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అన్నీ లైసెన్స్ పొందాలి. ప్రతి ఏడాది లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించిన కంపెనీల ఆపరేటింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. అప్పుడు ఆ యాప్ దేశంలో చట్టబద్ధంగా పని చేయలేదు. లైసెన్స్ లేకుండా సేవలు అందిస్తే రూ.95లక్షల జరిమానా విధిస్తారు. తప్పను సరిదిద్దుకోకపోతే ప్రతి రోజూ అదనంగా రూ.23వేలు ఫైన్ వేస్తారు. సంస్థ ప్రతినిధులకు 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే చాన్స్ ఉంది.

## నార్వేలో 'పర్సనల్ డేటా యాక్ట్'

నార్వే సర్కార్‌కూడా పిల్లల ఆన్‌లైన్ భద్రత విషయంలో కఠినమైన నిర్ణయం తీసుకున్నది. సోషల్ మీడియాతో పిల్లల మెదడుపై పడుతున్న ప్రభావాన్ని అరికట్టేందుకు 15 ఏళ్ల వయోపరిమితిని చట్టబద్ధం చేస్తూ అడుగులు వేస్తున్నది. "ఇది టెక్ దిగ్గజాలకు, చిన్న పిల్లల మెదళ్లకు మధ్య జరుగుతున్న పోరాటం" అని నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ కామెంట్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా వాడటానికి కనీస వయస్సు 13 ఏండ్లు (తల్లిదండ్రుల అనుమతితో). ఈ వయోపరిమితిని 15 ఏళ్లకు పెంచుతూ నార్వే ప్రభుత్వం 'పర్సనల్ డేటా యాక్ట్'ను సవరిస్తున్నది.

బ్యాంక్ ఐడీ వంటి పటిష్టమైన డిజిటల్ గుర్తింపు వ్యవస్థలను సోషల్ మీడియా లాగిన్ కోసం వాడాల్సి ఉంటుంది.

యూజర్ సెల్ఫీ ద్వారా వారి వయస్సును ఏఐ అంచనా వేస్తుంది.

నిబంధనలు పాటించని కంపెనీలకు వారి వార్షిక గ్లోబల్ టర్నోవర్‌లో 4% వరకు లేదా భారీ మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉంది.

సగం మంది 9 ఏండ్ల పిల్లలు ఇప్పటికే సోషల్ మీడియా వాడుతున్నారు.



## ఫ్రాన్స్‌లో 'డిజిటల్ మెజారిటీ కాన్సెప్ట్'

ఫ్రాన్స్ ప్రభుత్వం 'డిజిటల్ మెజారిటీ' అనే కాన్సెప్ట్‌ను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నది. 'మన పిల్లల మెదళ్లు అమ్మకానికి లేవు' అని సోషల్ మీడియా సంస్థలను ఉద్దేశించి అధ్యక్షుడు మాక్రాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్ చట్టం ప్రకారం.. 15 ఏళ్లు నిండిన వారే డిజిటల్ మేజర్లు. ఈ నిబంధనలు సెప్టెంబర్ 2026 నుంచి అమల్లోకి తీసుకురావాలన్నది లక్ష్యం.


15 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాలో ఖాతా తెరవాలంటే కచ్చితంగా తల్లిదండ్రుల అనుమతి ఉండాలి. 15 ఏళ్లలోపు వారు సైన్-అప్ చేసే సమయంలో, తల్లిదండ్రుల ఈమెయిల్ లేదా డిజిటల్ ఐడీ ద్వారా ఒక 'వెరిఫికేషన్ లింక్' వెళ్తుంది.

తల్లిదండ్రులు ధృవీకరిస్తేనే ఆ అకౌంట్ యాక్టివేట్ అవుతుంది. కంపెనీలు నిబంధనలు ఉల్లంఘిస్తే, ఆ సంస్థ ప్రపంచవ్యాప్త వార్షిక ఆదాయంలో 1% వరకు జరిమానా విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

## బ్రిటన్‌లో ఫేషియల్ స్కాన్‌తో ఏజ్ వెరిఫికేషన్

యూకే ప్రభుత్వం కూడా ఆస్ట్రేలియా బాటలోనే నడుస్తూ, సోషల్ మీడియాపై అత్యంత కఠినమైన ఆంక్షలు విధించే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఆన్‌లైన్ సేఫ్టీ యాక్ట్ –2023ని ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన చట్టంగా మార్చింది. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా బ్యాన్ చేయాలా? లేక వయోపరిమితిని పెంచాలా? అనే అంశంపై తల్లిదండ్రులు, నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నది. జనవరి 21, 2026న బ్రిటన్ ఎగువ సభలో 16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియాను నిషేధించాలనే ప్రతిపాదనకు అనుకూలంగా ఓటింగ్ జరిగింది.

సోషల్ మీడియా సంస్థలు పిల్లల భద్రతకు సంబంధించి విఫలమైతే, ఆ కంపెనీ ప్రపంచవ్యాప్త వార్షిక ఆదాయంలో 10% వరకు జరిమానా విధిస్తారు.



పిల్లలు వయస్సును అబద్ధం చెప్పకుండా ఉండేందుకు ఫేషియల్ స్కాన్ వెరిఫికేషన్ వంటి పద్ధతులను వాడాలి.

## స్పెయిన్‌లో పేరెంట్స్ అనుమతి తప్పనిసరి

స్పెయిన్ ప్రభుత్వం కూడా చిన్నారుల డిజిటల్ భద్రత విషయంలో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. యూరప్‌లో ఈ తరహా కఠిన చట్టాన్ని ప్రతిపాదించిన మొదటి దేశాల్లో స్పెయిన్ ఒకటి. స్పెయిన్ ప్రభుత్వం తన ప్రొటెక్షన్ ఆఫ్ మైనర్స్ ఇన్ డిజిటల్ ఎన్విరాన్మెంట్ బిల్లు ద్వారా సోషల్ మీడియా వాడకంలో భారీ మార్పులు తెచ్చింది. గతంలో 14 ఏళ్లు నిండిన వారు తల్లిదండ్రుల అనుమతి లేకుండా సోషల్ మీడియా ఖాతాలు తెరిచేవాళ్లు. ఈ వయోపరిమితిని 16 ఏళ్లకు పెంచారు. 16 ఏళ్లలోపు వారు సోషల్ మీడియాలోకి ప్రవేశించడం చట్టరీత్యా నిషేధం. 14 నుండి 16 ఏళ్ల మధ్య ఉన్నవారు సోషల్ మీడియా వాడాలంటే తల్లిదండ్రుల లేదా సంరక్షకుల డిజిటల్ సంతకం/అనుమతి తప్పనిసరి. నిబంధనలను ఉల్లంఘించే టెక్ కంపెనీలకు మిలియన్ల యూరోలలో జరిమానా విధించేలా చట్టంలో నిబంధనలు చేర్చారు.



## చైనాలో నియంత్రణ, టైమ్‌పై ఫోకస్

చైనా అనుసరిస్తున్న విధానం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మిగిలిన దేశాలు వయోపరిమితి మీద దృష్టి పెడితే, చైనా నియంత్రణ, సమయం మీద ఫోకస్ పెట్టింది. దీని కోసం చైనా ప్రభుత్వం మైనర్ మోడ్ అనే అత్యంత శక్తివంతమైన సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చింది. ఇంటర్నెట్ నియంత్రణ సంస్థ సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చైనా (సీఏసీ) ఈ నిబంధనలను రూపొందించింది. దీని ప్రకారం.. స్మార్ట్‌ఫోన్ తయారీదారులు, యాప్ డెవలపర్లు, టెలికాం ఆపరేటర్లు అందరూ కలిసి ఒకే గొడుగు కింద పనిచేయాలి.

వయస్సును బట్టి రోజుకు ఎంత సమయం ఇంటర్నెట్ వాడాలో చట్టం నిర్ణయించింది. 8 ఏండ్లలోపు పిల్లలు రోజుకు కేవలం 40 నిమిషాలు, 8 నుంచి 15 ఏండ్లలోపు పిల్లలు రోజుకు గరిష్టంగా 1 గంట, 16 నుంచి 17 ఏండ్లలోపు వాళ్లు రోజుకు 2 గంటలు మాత్రమే ఇంటర్‌నెట్ వాడాలి.

వయస్సుతో సంబంధం లేకుండా, 18 ఏళ్లలోపు మైనర్లు ఎవరూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటర్నెట్ వాడటానికి వీల్లేదు. ఆ సమయంలో ఫోన్ ఆటోమేటిక్‌గా 'మైనర్ మోడ్'లోకి వెళ్లిపోయి ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తుంది.

పిల్లలు ఏం చూడాలో కూడా ప్రభుత్వమే నిర్ణయించింది. 3 ఏండ్లలోపు వారు జోల పాటలు, పిల్లల పాటలు, ఆడియో కంటెంట్ మాత్రమే చూడాలి. 12 ఏండ్లలోపు పిల్లలు ఎడ్యుకేషన్, సైన్స్ వీడియోలు, సామాజిక బాధ్యతను పెంచే వార్తలు మాత్రమే వీక్షించాలి. వారానికి కేవలం 3 గంటలే (శుక్ర, శని, ఆదివారాల్లో) గేమ్స్ ఆడాలి.

### మైనర్ మోడ్ ఎలా పని చేస్తుంది?

మైనర్‌మోడ్ కేవలం ఒక యాప్‌కు మాత్రమే పరిమితం కాదు, ఫోన్ మొత్తం దీని కిందకు వస్తుంది. తల్లిదండ్రులు తమ ఫోన్‌లో ఒక్క క్లిక్‌తో 'మైనర్ మోడ్' ఆన్ చేయొచ్చు. పిల్లలు ఒక యాప్ నుంచి మరో యాప్‌కు మారినా, మొత్తం ఫోన్ యూసేజ్ టైమ్‌ను ఈ మోడ్ లెక్కిస్తుంది. పరిమితి ముగిసిన తర్వాత పిల్లలు ఇంకా వాడాలనుకుంటే, తల్లిదండ్రులు తమ పాస్‌వర్డ్ లేదా బయోమెట్రిక్ అనుమతిస్తేనే అదనపు సమయం లభిస్తుంది.

టిక్‌టాక్ వాడే పిల్లలకు కేవలం విజ్ఞాన ప్రదర్శనలు, మ్యూజియం టూర్లు, దేశభక్తి కలిగించే వీడియోలు మాత్రమే కనిపిస్తాయి. దీనిని చైనా ప్రభుత్వం యూత్ మోడ్ అని పిలుస్తుంది.

సోషల్ మీడియాలో ఇన్ ఫ్లుయెన్సర్లకు పిల్లలు టిప్స్ ఇవ్వడం లేదా ఖరీదైన వర్చువల్ గిఫ్ట్స్ కొనడంపై పూర్తి నిషేధం ఉంది.

పిల్లలు తమ తల్లి దండ్రుల ఐడీలతో లాగిన్ అయి ఈ రూల్స్ బ్రేక్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీన్ని అరికట్టడానికి చైనా ఇప్పుడు ఫేషియల్ రికగ్నిషన్‌ను ప్రతి 15 నిమిషాలకు ఒకసారి తప్పనిసరి చేసే ఆలోచనలో ఉంది.